



మండలప్రాడ్వివాకుని కార్యస్థానాని కంటి పెక్కుమంది సేవకు లుంటారు. వారి నందఱిని సేవకులని పిలువరు. 'కోర్టుబంట్రోతులు' అని వాడుగ్గా అంటారు. అబ్దుల్ ఖాసీమ్ అనే మహమ్మదీయు డొకానొక డారకం పనిలో ప్రవేశించి యిక్కడకు పదేను పదారేండ్లనుండి సర్కారువారి జీతం బత్తెం తింటూవున్నాడు. ఆతడు ఒడ్డు పొడుగు ఉన్న మనిషి: గడ్డం ఖాజీ ననుసరించి యుంచి నట్లు తోస్తుంది—పొడుగ్గా, కొస లుంగ్రాల మెలి త్రిప్పి:—తలపాగా మొగలాయిఫక్కీగా చుట్టుకుంటాడు. టోపీ పెట్టుకోడు. మెల్లో ఒకకైజా రమేషా ఎప్పుడూ ఉంచుకుంటాడు. బిళ్లడవాలు జందెంలా చొక్కామీద వేసికొని, ఆడవా లటూ యిటూ బెసక్కుండా నడుం కోకండువా చుట్టేస్తాడు. ఒకతడవ అతణ్ణి చూచినవెనుక మనచూపుల్లో అతడు మఱి మాఱిపోడు.

అతని భార్యపేరు లాల్‌బీబీ. పాతికేళ్లుంటాయి ఆమెకు. ఆమెచెవుల అంచుల్ని వరుసగా అన్నీ కుళ్లే: అంగుళంలో దశాంశమన్నా వుంటుందో ఉండదో కుట్టుకూ కుట్టుకూ ఎడం. ఆమె మణికట్లను గాజులు బంగారపువి, ఈచేతి కోఅయిదు, ఆచేతికో అయిదు ఉన్నాయి. ఆమెవ్రేలి నొకలోహపు వుంగరం కలదు. కాళ్లవస్తువులు లంగాచేతను మెళ్లో వస్తువులు వోణీకబ్బాలవల్లను కప్పడి, హరిబ్రహ్మాదులకైనను కనబడవు. పైని వివరించిన ఆభరణాలు మాత్రం చూడ్డానికి సాధ్యమా! బురకా యేమైంది? అని అంటే అనవచ్చును చదువరులు. అవన్నీ ఒక్కసారి ఒక్కచూపుచేత ఒక్కప్పుడు చూడబడ్డాయి. ఆచూచినతను ఊరుకోక లోకాని కంతకూ విదితం చేసినాడు. మఱిక దాపరిక మెందుకు?


ఖాసీమ్‌కు కోర్టుబంట్రోతుఉద్యోగం ఈ వేళఉదయం అయి పనిలో ప్రవేశించినా డనుకోండి. ఆరాత్రి లాల్‌బీబీ పులావ్ చేసింది. ఖాసీమ్‌లాల్‌బీబీలు పులావ్ భుజించి, ఆ వెనుక ఖాసీమ్ లాల్‌బీబీతో ముద్దుముచ్చట్లకు దిగడంలో, "మేరీ ప్యారీ బడీ సుల్తానా" అని పిల్చాడు. అంటే తెనుగులో దానిఅర్థము

'నాప్రియమహారాజ్ఞీ' అన్నమాట. అని పిల్చే సరికి లాల్‌బీబీ, "ఈపొద్దల్లా తోడుబూబులంతా 'బంట్రోతుగారిభార్యా' అని పిల్చి విరసంగా పల్కినపల్కు, అంతా ఒక్కసారి 'బడీసుల్తానా' అన్నంత మాయమైపోతుందా? బంట్రోతువుద్యోగం మానేస్తే మంచిది. మనకు వద్దు"అంది. "నీకు తెలీదు. లోకానికి తెలీదు దానిదర్జా. నేను రే పీదారినే మాప్రాడ్వివాకును విహారంగా యిలా తీసికొనివస్తాను. అప్పుడు చూడు, అయనకూ నాకూ ఏమైనా తేడా వుంటుందేమో. బంట్రోతు అంటే రాజాబహద్దర్ అనుకో. బంట్రోతుమానాగలమనిషి అంటే హాడల్. లోకాని కేం తెలుసు? ఏకాడో ఓకాడ ఒక డోవుద్యోగం సద్యోగం సంపాదించుకొని పొట్టపోసికుంటూంటే చూడలేదు. ఏదో చొప్పదంటు అంటించి, చుఱకెట్టాలని చూస్తూవుంటారు అందరూ." అని అన్నాడు. కప్పుపళ్లనే చిరునవ్వు నవ్వింది లాల్‌బీబీ.

రాత్రి కడిచిపోయింది; తెల్లవాఱింది. ప్రాడ్వివాక్కుకు ఒకఆ వుంది. ప్రాడ్వివాక్కు ఖాసీమ్‌ను ఆఆవుదగ్గఱ పేడ తీసెయ్యమన్నాడు. ఖాసీమ్ మాఱుమాటాడకుండా తీసివేసినాడు. ఆనాటిపనులలో ఖాసీమ్ జ్ఞాపకం వుంచుకోదగ్గపని అది వొక్కటే.

సాయంకాల మైదుగంట లైంది. ప్రాడ్వివాకు ఖాసీమును, క్రొత్తసేవకుడుగదా కొత్తదారి చూపిస్తాడు, పాతదారి విసుగు అని, "ఖాసీమ్! షికారెటు పోతే బాగా వుంటుంది ఈవేళా" అని అడిగాడు. "ఈలాఅండీ" అని ఖాసీమ్ తనవీథినే తీసికొని వెళ్లినాడు. ఖాసీమ్ ముందు తనవేషమంతా వేషంలా వుంచుకొని నడుస్తూన్నాడు. ఆవెనుక ప్రాడ్వివాకు, తల పాగా ఆయనా ఆయనా పామేదాగానే నడుస్తూవున్నాడు. అరుగులమీద ప్రజలు లేచి వందనాలు పెడుతూన్నారు.

ఖాసీమ్‌ఇంటిసమీపంలోనికి వచ్చేసరికి ఖాసీమ్‌భార్యా చూస్తూవుంది, వీథిగుమ్మానికి వున్న గోనిగుడ్డతెర గాజులచేతులనే ఒత్తిగించి, కుట్టుడు చెవుల పైకి మేలిముసుగు తీసికొని,—



'అనేనండి బాబు మాయిల్లు'

ప్రాడ్వివాక్కు ఈయిల్లు ఆయిల్లు చూచినట్టుగానే తనయిల్లుకూడ చూచీచూడనట్టు

పెడముఖమై, తనభార్య కక్కనబడకపోతాడేమో అనేభయంకొద్దీ యిల్లుదాటి యీవలకు వచ్చేలోగ, "అదేనండి బాబూ, మాయిల్లు" అన్నాడు ఖాసీమ్. "ఆ! చూచాను." అన్నాడు ప్రాడ్వివాకు. విహ్వాతి నానాటిసాయంకాల విశేషం ఖాసీమ్ఇల్లు అనే అనుకోవాలి.

ప్రాడ్వివాకుని వారియింటివద్ద దిగబెట్టి ఖాసీమ్ తనయింటికి తిరిగి వచ్చేసరికి నాడు రాత్రి ఎనిమిదిఘంటలైంది. "ఏం, చూశావా, నన్నూ నాప్రాడ్వివాక్కునూ?" అన్నాడు ఖాసీమ్ లాల్‌బీబీతో. లాల్‌బీబీ "చూచినాను. దర్జాగా వుంది" అంది. "అంతే నాపని. అంతే నాపని. దాన్ని బంట్రోతుపని అననియ్యి, బహద్దర్‌పని అననియ్యి. విహ్వాతిబయలుదేఱినప్పుడు నేను ముందు ఆయన వెనుక నడుస్తూ వుంటాం. ఆయనబరువు నే మోసేదిలేదు. నాబరువు ఆయన మోసేదిలేదు. మోటార్ సైకిలుమీద వెళ్లేటప్పుడు ఆయన నన్ను ప్రక్కను గూర్చోమని తానే తొక్కుకుంటాడు బండి. ఇంటివద్ద ఆయన యింట్లో కూర్చుంటే నేను వీథరుగుమీద కూర్చుంటాను. కచేరీలో ఆయనా నేనూ ఒకేపంకా క్రింద వుంటాం. గాలి ఆయన కెంతఎంత చల్లగా కొట్టుతుందో, నాకూ అంతఅంత చల్లగా కొట్టుతుంది" అన్నాడు. "మఱి మన బాబూ లంతా అంతవిడ్డూరంగా చెప్పుకుంటారేం?" అని అడిగింది లాల్‌బీబీ. "అయితే ఒకటి వుంది, నీకు తెలియంది: నాకు వుదయం నుంచి మనస్సులో మెదులుతూవున్నది; లోకానికంతకూ బహుశా మనల్ని ఈసడించడానికి కారణభూతమైంది: ఉదయాన్నే ప్రాడ్వివాక్కుగారి పాడియావుకట్టుకర్రదగ్గఱ పేడ పోగేసి శుభ్రంచేయాల" అన్నాడు ఖాసీము. లాల్‌బీబీ వెంటనే "ఆపని ప్రతిఉదయం నేను చేసిపెట్టేటట్లయితేనో" అంది. "నన్ను బంట్రోతు అంటారు గాని నిన్ను బానిస అంటారు, చూచినవాళ్లంతా" అన్నాడు ఖాసీమ్. "ఆ మాత్రానికి 'ప్యారీ బడీ సుల్తానా' అని నన్ను రాత్రి పిలవడం ఎందుకు?" అంది. "అదో సరాగం" అన్నాడు. ఇరువురూ అప్పటి కప్పడతివినోదంగా వున్నట్టున్నారు. కాని ఇరువురికీ ఆరాత్రి అయోమయాంధకారంలో ప్రాడ్వివాక్కులవారి యింటివద్దఆవు, ఆవులసాల, ఆసాలలోని ఆ ఆవు మూత్రపురీషాదులు పోయడం, వేయడం, అన్నీ మషీలేపము రాసిన రాగి రేకుమీది అక్షరాలల్లే అగపిస్తూనేవున్నాయి.

ఇద్దఱూ తెల్లవాఱగట్ల నాలుగ్గంటలకే యింకా వేగు బాగా విడివడి వెల్లబాఱక మునుపే మేలుకొని యొకఆలోచన చేసికొని యిలువెడలి బయలుదేఱినారు. బీబీ ఒకశాలువా ముసుగు వేసికుంది. తిన్నగా ప్రాడ్వివాకులఇంటికి సేవ కరిగినట్లే వెళ్లినారు.

తూర్పుదిక్కునందు శుక్రనక్షత్రము తెల్లగా ఓమాత్రం వెన్నముద్దంత వుండి గండుకిరణాలు చల్లగా లాల్‌బీబీముక్కుబులాకీమీదికీ, ఖాసీమ్‌యొక్క గడ్డంమీదికి వెదజిమ్ముతూ వుంది. "ఇదే ఇ"ల్లన్నాడు ఖాసీమ్. అప్పటి

కప్పుడే ప్రాడ్వివాక్కులయింటి పాచిచేసే పనికత్తె వీథిగుమ్మం కొబ్బరీనెల చీపురుతో చప్పుడయ్యేటట్టు ఊడ్చి, నూతికేసి నీళ్లు తెచ్చుకోడానికి వెళ్లిపోయింది. సింహద్వారం బార్లా తీసివుంది. సింహద్వారం చొఅబడి లాల్ బీబీ ఖాసీమ్లు ఇరువురూ సందుగుమ్మానే ఆపనికత్తెకు తెలియకుండనే ఆవులసాలలో ప్రవేశించినారు. పనికత్తె యథాప్రకారంగా తన నీళ్లూ ముగ్గూ తెచ్చుకొని, కళ్లాపు చల్లుకొని, రెండుచారలు గీసి, రెండుచుక్కలు కొట్టి, ఆముగ్గుచెయ్యి ఆవీథిగోడను తట్టి, "అమ్మగారూ! నే వెడుతున్నానండోయి. తలు పేసుకోండి" అని కేకేసి పోయింది.

అమ్మగారనగా ప్రాడ్వివాకులవారి భార్య. ఆమె నడుం విఱుచుకొని, జడ సరుదుకుని, జడిమ నుడుపుకొని, లేచి వెళ్లబోతూంటే, ప్రాడ్వివాకులు ఆమెను మంచంపట్టినున్న మనిషిని మంచంపట్టి దిగకుండా ఆపి, "ఖాసీమ్ ఈపాటికి వస్తూవుంటాడు. మళ్లీ వాడికి తలుపుతీయడానికి నేను లేవాలి. ఆలా ఉండనియ్యి తలుపు. తెల్లాఱనియి" అని తిరిగి పన్నుండజేసినాడు.

పశువులసాలలో లాల్ బీబీ పేడ పోగేస్తూంది. ఖాసీమ్ నూతివద్దకు వెళ్లి, బాల్చీతో బాల్చెడు నీళ్లు తోడుకొనివచ్చి సాలయీవల నుంచున్నాడు. "తెల్లాఱి పోయిందా?" అంది లాల్ బీబీ. "అవుతూ అవుతూవుంది" అని ఖాసీమ్ అన్నాడు. సాల యీవలకు వచ్చి నిలుచుంది బీబీ. బీబీచేతుల మీద నీళ్లు పోసి, చేతులు కడుక్కోనిచ్చి, సరిగా శాలువాముసుగు ఎప్పట్లా వేసేసుకోమన్నాడు. లాల్ బీబీ ఎప్పట్లా వేసేసుకొంది.

అప్పటి కప్పుడే ప్రాడ్వివాకూ, ఆయన భార్యా "దాసీది వెళ్లిపోయి చాలాసేపైంది. తెల్లాఱదా యీపాటి కన్నా" అని గదికిటికీ తలుపులు తెఱచుకొని, వీథిగుమ్మంకేసి చూస్తూ వున్నారు, "ఖాసీమ్ ఇంకా రాలేదేం చెప్మా" అని. ఖాసీమ్ అప్పుడే తనబూబును వీథితల్పు తీసి ఆవల కంపుటకై వీథిగుమ్మంవఱకూ తీసికొని వచ్చి, "ఒక్కర్తెవు ఇంటికి వెళ్లగలవా?"



'ఒక్కర్తెవు ఇంటికి వెళ్లగలవా'

అని నెమ్మదిగా అనుచున్నాడు. లాల్ బీబీయు తనశాలువ కొంచె మొత్తిగించుకొని, వెనుచూపునే ఖాసీమ్‌ను చూచి, "వెళ్లగల" అని


వీథితలుపు మూయ లాగుతూ నిష్క్రమిస్తూంది.

నిన్న సాయంకాలం చూచిన తెరమఱుగు బీబీవా అన్నట్లు ప్రాడ్వివాకుని చూపుల్లో మఱోమాఱు మెఱిసినాయి ఆమెయొక్క చెవికుట్లు, చేతికంకణాలు, అన్నీ. ప్రాడ్వివాకునిభార్యా కదేమీ మనసులో లేమి, “ఖాసీమ్! ఆమని షెవరు? ఎప్పుడు వచ్చినావు నీవు?” అని అడిగింది. ఖాసీమ్ “అది మా యింటి పనిబానిస. మన ఆవుపేడ తీయుటకు దానిని పురమాయించినాను. అది తెల్లవాఱగట్ల వచ్చి పోగు చేసి పోతుందిలేండి యీ రోజునుంచీ” అన్నాడు. ప్రాడ్వివాకు విన్నాడు. ఖాసీమ్ సగముసిగ్గుపడి, సగము మఱేమీతోచక తావినవలసినది పూర్తి కాకుండానేవీథరుగుపైకి వెళ్లిపోయినాడు.

ప్రాడ్వివాకు తనభార్యతో “అది వాని పనిబానిస కాదు, ప్రణయ-బానిస” అన్నాడు.

మఱి ఆనాటినుంచి అబ్దుల్ఖాసీమ్ను— అబ్దుల్ ఖాసీమ్ను అన్నమాటేం, మఱే సర్కారుబంట్రోతును గాని, తనయింటియందలి సొంతపనులు నిర్వర్తించుటకై ఆప్రాడ్వివాకులు నియోగించియుండలేదు. లాల్బీబీ మఱి పొరుగింటికి వచ్చి పనిచేసి యెఱుగదు.

ప్రాడ్వివాకుల్ని ప్రాడ్వివాకుభార్య “ప్రణయ-బానిస అంటే ఏమిటి”అని తరిచి తరిచి అడిగింది. వెంటనే “నీవు నా కెలాంటిదానివో, వాని కది అలాంటిది” అన్నాడు ప్రాడ్వివాకు.



‘ప్రణయ-బానిస అంటే ఏమిటి..........అడిగింది.’

“మీ కెట్లా తెలుసు వానిభార్యా అది అని” అని అడిగింది. “కనబడలే, చేతుల్ని బంగారు కంకణాలు, చెవుల్ని బంగారుకుట్లూ”అన్నాడు. “అలైతే ఖాసీమ్యొక్క ‘ప్రియమహారాజ్ఞి’ అని అనండి, ప్రణయ-బానిస యేమిటి?” అంది ఆమె.

కొంచె మెచ్చుతక్కువగా అట్లనే పిల్చినాడుగా లాల్బీబీని ఖాసీమ్, తన కుద్యోగమైన తొలినిశి—“మేరీ ప్యారీ బడీ సుల్తానా!”

---